# ఆపద్ధర్మం

"మోహన్ మామయ్య వచ్చాడా?" అన్నాడు నిద్రలోకి జారిపోతూ నాని. కృష్ణమణి పొదరు అద్దుకుంటుంటే సగం వాలే కళ్లతో చూశాడు వాడు. ఎనిమిదేళ్ళుంటాయేమో! కృష్ణమణి చటుక్కున వెనక్కు తిరిగింది. "మామయ్య కాదు. పెద్ద నాన్న అనాలి. లేకపోతే బాబాయి అనాలి. లేకపోతే బావగారూ అనాలి" అని దిద్దింది.

మోహన్ వచ్చినప్పుడల్లా అమ్మ బయటికి వెళ్ళిపోయి మర్నాడు తను, అక్క స్కూలుకి వెళ్లేదాకా రాదని తెలుసు వాడికి. ఒక్కొక్కసారి అక్కా, తను స్కూలునుంచి వచ్చాక కూడా వస్తుంది.

చిన్న సంచీ పట్టుకెడుతుంది. వెళ్లేటప్పుడు ఆ సంచీలో ఏముంటాయో పట్టకపోయినా తిరిగి వచ్చాక మాత్రం బట్టలు తీస్తోంటే లడ్డూలు, చాక్లెట్లు, బిస్కట్లు, నానికి కొత్త బట్టలు, వాడి అక్క రమ్యకి కొత్త గౌను - ఏవేవో వుంటాయి. కొన్ని సార్లు పప్పు ఉండలు కూడా వుంటాయి. సంబరపడిపోతూ అవి తీసుకుని, పంచుకుని తింటారు. వాళ్ళకి స్నానాలు, యూనిఫారం బట్టలు ఉతకడానికి, అన్నం వండి పెట్టడానికి పనిమనిషి గంగి ఉండనే వుంది.

మోహన్ ఎంతో చక్కగా తయారై వస్తాడు. టౌనులో అతనికి షాపు వుంది. గ్రామం లోనూ చిన్న షాపు వుంది.

కృష్ణమణి తొందరగా బొట్టు దిద్దుకుని, పెదవులకి రంగు పూసుకుని, టైము ఏడైందని చూసుకుని, గంగికి అప్పగింతలు పెట్టింది. ఆడపిల్ల రమ్య స్కూలు నుంచి రాగానే పడకేసింది. దాని వళ్ళు వెచ్చబడిందేమో చూసింది. లేదని తెలిసి నిట్టూర్పు విడిచింది. వెళ్ళాలి తప్పదు. ఇవ్వాళ ఏదో స్పెషల్ అన్నాడు మోహన్. మంచి చీరె కాకుండా ఒక మెరుపుల డ్రెస్సు కూడా పెట్టుకుంది.

మనస్సులో ఆలోచనకి చోటు లేదు. దిగులుకి సమయం లేదు. రాత్రికి రాత్రి వెయ్యి రూపాయల వరకు సంపాదించాలి. మరి కృష్ణమణి అందం అల్లాంటిది. లావణ్యం ఉట్టి పడే ఆమె చేతులు, నడుము ఎవరికైనా వెర్రెక్కిస్తాయి. టౌనుకి మనిషికి నాలుగు రూపాయల చొప్పున ఆటో, కానీ, నలుగురు మనుష్యుల ఛార్జీలూ తనే యిచ్చేసి, మోహన్ తీసికెడతాడు. ఆటో మనిషికీ తెలుసు. కృష్ణమణి సెంటు ఘుమాయింపు గుర్తుపట్టేస్తాడు కూడా.

కృష్ణమణి నల్లరంగు శాలువా కప్పుకుంటుంది. ముఖం కూడా కప్పుకుంటుంది. గతుకుల రోడ్డులోంచి ఆటో వెడుతోంటే, అటూ యిటూ దిక్కులు చూస్తుంది. ఊరి చివరగా వుంది వాళ్ళ యిల్లు. చీకటి పడుతోంటే బాట ఒక్కోసారి గుర్తుపట్టదు కూడా.

చెరువుగట్టున పోతోంటే కళకళలాడే రొయ్యల చెరువులు గుర్తుకు వస్తాయి. లైట్లు వెలిగి పోతోంటే బోలెడు జనానికి పని కల్పించే ఆ చెరువులు యిప్పుడు బీడు పడ్డాయి. కృష్ణమణి మొగుడు వీరాస్వామి పదిలక్షలు అప్పుచేసి మరీ పెట్టాడు రొయ్యల చెరువులు. ఒకటి రెండేళ్ళు చాలా బాగా జరిగింది వ్యాపారం. రవాణా బాగానే జరిగింది. చేతుల్లో నోట్లు వచ్చిపడేవి. కానీ ఎంత కట్టినా వడ్డీలు, అప్పులు తీర్చలేకపోయినాడు.

పెద్ద ఎత్తున చచ్చిపోయినాయి మీనులు. నష్టం వచ్చేసింది. కూలీలు కూడా యివ్వలేక పోయాడు. బ్యాంకుల వాళ్ళు నోటీసులు పంపటం మొదలెట్టారు. నెత్తిమీదకు వచ్చిజప్తుకి వచ్చాయి. వీరాస్వామికి వున్న నాలుగెకరాల పొలం మీదకు జప్తు వచ్చింది. పంట యింటికి తెచ్చుకోవడానికి లేకుండా గొడవైంది. ఇల్లు కూడా ముప్పులో పడింది. వీరాస్వామి తిండి తినడం మానేశాడు. కృష్ణమణి ఏడుపు. పిల్లలు దిగులు పడిపోయారు. ఊళ్లోవారు రకరకాలుగా మాట్లాడసాగారు. ఊళ్లోకి బ్యాంకి వాళ్ళు వచ్చారనగానే యీ రొయ్యల చెరువుల వాళ్ల పని పట్టడానికే అని అందరికీ తెలిసిపోయింది.

కానీ జరుగరాని పాపం జరిగిపోయింది. వీరాస్వామి చెరువు దగ్గరికి వెళ్లాడు. చీకటిలో తను పట్టుకెళ్లినది ఏదో తాగేశాడు. గిలగలలాడాడు. మంటలతో మొత్తుకున్నాడో, అరిచాడో ఎవరికీ తెలియదు. ఎంత రాత్రయినా కూడా వీరాస్వామి రాకపోయేసరికి కృష్ణమణి కంగారుపడింది. నలుగురినీ కేకేసింది. లైట్లు పుచ్చుకుని చెరువు దగ్గరికి వెళ్లాడు. కొనవూపిరితో స్పృహతప్పి పడివున్న వీరాస్వామిని యింటికి చేర్చారు. ఊళ్లో డాక్టరు కూడా ఆరోజు సినిమాకి పోయాడు. విరుగుడు ఏదో యివ్వాలని ప్రయత్నించారు. ఫలితం లేకపోయింది. రాత్రి రెండు గంటల ప్రాంతంలో కృష్ణమణి గుండె బాదుకుని ఏడవడం వూరంతా వినిపించింది.

అప్పటికే నెల్లాళ్ల క్రితం వూళ్లో మరో చావు చూశారు జనం. అప్పులు తీర్చలేక, తీర్చే మార్గం లేక, వొత్తిడి తట్టుకోలేక, పరువు పోతుందని వణికిపోతూ ప్రాణం తీసుకున్నాడు మరొకాయన. ఆయన మార్గం చూపించినట్లయింది వీరాస్వామికి.

వీరాస్వామికి విముక్తి దొరికింది. పెళ్లాం, బిడ్డలు ఏమైనా కానీ అని వెళ్ళిపోయి నట్ల యింది. ఇంట్లో కృష్ణమణి నగలు, వున్న నాలుగు వెండి వస్తువులు తాకట్టులోకి వెళ్లి ఆ తర్వాత అమ్ముడు పోయినాయి.

తిండి గడవడం కష్టమైపోతోంది. పిల్లల స్కూలు జీతాలు కట్టాలి. కృష్ణమణికి పుట్టింటి వారూ ఎవరూ లేరు. టౌను నుంచి వస్తున్న కాస్త దూరపు బంధువు మోహన్ మరీ తరచుగా రాసాగాడు. అతనికి ఆదాయం బాగానే వుండేది. రెండు వేలకి యింటికి కావలసిన పప్పు, ఉప్పు తెచ్చి పడేసేవాడు.

తిండి సరిగా లేక చిక్కినా లావణ్యం వుట్టిపడే చక్కనిది కృష్ణమణి. ఆ యిల్లు, పరిసరాలు, యింట్లో పనిమనిషి తప్పితే మరో పెద్ద వాళ్లు లేక పోవడం, యీ పరిస్థితులన్నీ కలసి వచ్చి మోహన్ కృష్ణమణిని దగ్గర చేసుకున్నాడు. అతనికి జాలి, మోహం వున్నాయి కానీ బతుక నేర్చిన తనం కూడా వుంది. పెళ్లయి రెండేళ్లయినా భార్యపై అంతగా వ్యామోహం కలుగలేదు.

కృష్ణమణి చక్కదనం అంగడికి పనికి వస్తుంది. ఎల్లాగూ భర్త లేదు. మోహన్ ఏదో స్నేహ పాత్రుడు. యింటికి శ్రేయోభిలాషి. ఆదాయం లేదు. వీరాస్వామి చచ్చిపోవడంతో అప్పులన్నీ మాఫీ అయిపోయినట్లే. రొయ్యల వ్యాపారం పాడుబడింది. ఉన్న కాస్తా కూడా వాళ్లూ వీళ్లూ బొక్కేశారు. ఆ భూమి ఉప్పు పేరుకొని పోయి సాగుకి పనికి రాకుండా పోయింది. అదంతా ఎప్పుడో చూసి కలెక్టరుగారు మళ్లీ సాగుకి పనికి వచ్చేట్లు చేయిస్తారు అని అందరూ చెప్పుకుంటున్నారు. ఏమైనా కృష్ణమణి టౌనుకి వెళ్లి వీలుంటే సిటీకి పోయి రెండు చేతులా ఆర్జించగలదు. అందుకు మోహన్ సాయపడ్డాడు. ఆరోగ్యం చూసుకుంటుంది. మందులు వేసుకుంటుంది. భారీ కష్టమర్లేగానీ, చిల్లర బేరగాళ్లు ఎవరూ వుండరు. సాధారణ లాడ్జీలు కాక, భారీగా

వుండే హోటళ్ళకు తీసుకెడతాడు మోహన్. ఏడాది తిరిగేటప్పటికి కృష్ణమణి దశ బాగా మారింది. ప్రణయాలు, ప్రేమలు, గొడవలు లేకుండా, కేవలం తన శరీరం పణంగా పెట్టివేలు సంపాదిస్తోంది. ఊళ్లో వాళ్లకి ఆమె ఏం చేస్తోందో తెలిసినా, లోకం పోకడ అల్లా వుందని చూసీ చూడనట్లు వూరుకుంటారు. పదవుల్లో వుండేవారికి, బాగా డబ్బున్న పారిశ్రామిక వేత్తలకు – ఉపయోగ పడుతోంది కృష్ణమణి.

వెలయాలి వృత్తి హేయమైనదా? తన ప్రమేయం ఏమీ లేని భర్త వ్యాపార నష్టాలు, పంటనష్టాలు, మార్కెటు నష్టాలు అన్నీ ఆమె మీద వచ్చి పడ్డాయి. తనకి వున్న విముక్తి మార్గం చూసుకున్నాడు వీరాస్వామి. కళ్లుమూసుకుని ప్రాణం వదిలేసుకోగానే బంధాలన్నీ తెగిపోయాయి. ఆర్థిక లావాదేవీలు ముగిసిపోయాయి. బతికి వున్న కృష్ణమణి, యిద్దరు పిల్లలు అదే దోవన పోలేదు. నిరాశలో పడి ఏడుస్తూ అడుక్కుని తినలేదు. ఎవరి పంచనో చేరి, ఛీత్కారాలు తింటూ అవమానం పాలు కాలేదు. అక్షర జ్ఞానమే ఆమె చదువు. బాగా బతికిన మనిషి. కూలీ పనులకు పోలేదు. సుకుమారి, బండ పనులు చేయలేదు. అందగత్తె, అందరినీ ఆకర్షిస్తుంది. పిల్లలమీద ఎన్నో ఆశలు. వీరాస్వామిలాగా అబ్బాయి, తనలాగా అమ్మాయి దౌర్భాగ్యులు కాకూడదని ఆలోచన. ఇవన్నీ పరిష్కరించేందుకే ఆమె కమర్షియల్ సెక్సువర్కరుగా పనిచేస్తోంది. ఏదితప్పు? ఏది ఒప్పు? ఇచ్ఛాపూర్వకంగా తనకి అన్నం దొరికించే పని చేస్తోంది. నిట్టూర్చి 'అయ్యో!' అనలేక, కళకళలాడే ముఖాలతో బడికి పరుగులెత్తే ఆమె పిల్లల్ని చూసి, వారు సంఘంలో ఏ పాత్ర వహిస్తారోనని వూహా కథలు అల్లడమే ఎవరేనా చేయగలిగే పని.